

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్ గిరి | శుక్రవారం | 14.08.2026 | సంపుటి: 3 | సంచిక: 192 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 14.08.2026 | VOLUME : 3 | ISSUE : 192 | PAGES: 8 | COST: 2/- |


## ఓటుకు నోటు కేసు మళ్లీ మొదటికి..

- సుప్రీంకోర్టులో మరోసారి విచారణకు రంగం సిద్ధం
- గతంలో వాదనలు విన్న న్యాయమూర్తులకు పదవీ విరమణ
- కొత్త ధర్మాసనం ముందు పూర్తిస్థాయి వాదనలు
- పాత వాదనలను పరిగణనలోకి తీసుకోలేమన్న సీజేఐ
- రాజకీయ వర్గాల్లో మళ్లీ పెరిగిన ఆసక్తి



2

## డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం

- ఎయిర్‌పోర్టుకు తరలివచ్చిన ఎమ్మెల్యేలు, నేతలు
- గజమాలతో అభిమానం చాటుకున్న రంగారెడ్డి అధ్యక్షుడు చల్లా

3



## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం

- కొత్త కార్డుల మోడల్ విడుదల
- ఈ నెల 15 నుంచి 15 రోజుల పాటు పంపిణీ
- భద్రత కోసం హోలోగ్రామ్, క్యూఆర్ కోడ్
- కార్డుపై కుటుంబ వివరాలు, చిరునామా
- రేషన్ పంపిణీలో పారదర్శకతే లక్ష్యం




2



# గోడ దూకితే

# గోస కచ్చే..

### కాంగ్రెస్‌లో చేరి.. ఇటు అటు కాకుండా ఫిరాయింపు ఎమ్మెల్యేలు

- బీఆర్ఎస్‌లో హోదా పోయి.. కాంగ్రెస్‌లో ప్రాధాన్యత కరువు
- నిధులు, అభివృద్ధి పనులపై పెరుగుతున్న అసంతృప్తి
- దానం నాగేందర్, పోచారం వ్యాఖ్యలతో బహిర్గతమైన ఆవేదన
- పటాన్‌చెరు పరిణామాలతో మరింత ఆసక్తి
- రాజకీయ భవిష్యత్తుపై అయోమయంలో పది మంది ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, ఆగస్టు 13 (రాజముద్ర న్యూస్):** తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన పది మంది ఎమ్మెల్యేల పరిస్థితి ఇప్పుడు ఇబ్బందికరంగా మారిందన్న చర్చ సాగుతోంది. అధికార పార్టీకి అండగా నిలిస్తే నియోజకవర్గాలకు పెద్దఎత్తున నిధులు వస్తాయని, పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని భావించి పార్టీ మారిన వారికి ఆశించిన స్థాయిలో ప్రయోజనం దక్కడం లేదన్న అసంతృప్తి వ్యక్తమవుతోంది. కొందరు ఎమ్మెల్యేలు బహిరంగంగానే తమ ఆవేదనను వెల్లడిస్తుండగా.. మరికొందరు అంతర్గతంగా అసహనంతో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మిగతా 3వ పేజీలో..



## మైనారిటీ రిజర్వేషన్లు కల్పించిన

# ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్ళి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్ 13(రాజముద్ర న్యూస్) :** ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల

మిగతా 2వ పేజీలో..

## ప్రత్యేక దృష్టితో కూకట్‌పల్లి అభివృద్ధి

- మంత్రి శ్రీధర్‌బాబుకు సీఎం ఆదేశాలు
- కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు శంకుస్థాపన
- 22-ఎ విషయంలో మీ భూములు పోకుండా చూస్తా
- అండగా అభివృద్ధి చేసి చూపిస్తా: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు

- 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీకి శ్రీకారం
- సెప్టెంబర్ 15వరకు దరఖాస్తుల స్వీకరణ
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

3





## గందరగోళంలో వర్షా కాల సమావేశాలు..

- బీజేపీ, విపక్షాల పోటాపోటీ నిరసనలు
- చివరి రోజూ కొనసాగిన రాజకీయ ఘర్షణ

4

## రాష్ట్రాన్ని దోచుకోవడంలో

# బీఆర్ఎస్‌తో పోటీ

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపీ రఘునందన్ రావు
- యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 13:** రాష్ట్రంలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ లు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు

మిగతా 2వ పేజీలో..



## నాడు ఉపన్యాసాలు..

# నేడు భూ అమ్మకాలు

- వేలం వెర్రిగా సర్కారు భూముల అమ్మకాలు
- నాడు కోర్టుకు వెళ్లి నేడు అడ్డగోలుగా అమ్ముకుంటావా?
- రాయదుర్గం హెరిటేజ్ భూ వేలాన్ని వెంటనే ఆపాలి
- సీఎంకు హరీష్ రావు లేఖ

2





## పిల్లల ఆరోగ్యంతో ఆటలొద్దు

4

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు



## ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

4

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై..

# హైకోర్టులో వాదనలు

- స్పీకర్ తీర్పును సవాలు చేస్తూ పిటిషన్లు
- 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ విచారణ
- స్పీకర్ పరిధి దాటారని పిటిషనర్ల వాదన

3



## ఈసీఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

**హైదరాబాద్ ,ఆగస్ట్ 13 (రాజముద్ర న్యూస్):** ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్

మిగతా 3వ పేజీలో..



## ప్రతిష్ఠాత్మకంగా 'ఖేలో ఇండియా' నిర్వహణ

- కేంద్ర మంత్రి మాండవీయతో వాకిటి

3

# నాడు ఉపన్యాసాలు.. నేడు భూ అమ్మకాలు

**హైదరాబాద్, ఆగస్టు 13 :**

రాష్ట్రంలో వేలం వెర్రిగా ప్రభుత్వ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేత టి.హరీష్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా అంటూ ప్రశ్నించారు. ఈమేరకు సీఎంకు ఓ లేఖ రాశారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు నేడు ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడికక్కడ భూములు అమ్మేకుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని అని అన్నారు. జీవో ఎంఎస్ నెం.4 ద్వారా రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83కు హెరిటేజ్ సైట్‌గా గుర్తించినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయన్నారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం వాటినే వేలం వేయడం ఏమిటని నిలదీశారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉండగా ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాటనా అని ప్రశ్నించారు. ఇదే సర్వే నంబరులో గతంలో 6.2 ఎకరాలు ఎకరాకు సుమారు రూ.237 కోట్ల చొప్పున వేలం వేసే ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని, ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయంటూ భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం భూమిని అమ్మడానికి ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము అన్న హామీ ఏమైందని అడిగారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి మాటలకు విలువ లేదా అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా థర్డ్ పార్టీ ఇంటరెస్ట్ సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఈనెల 17, 21 తేదీల్లో జరపనున్న వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, ఎక్స్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిగా కాక ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవు పలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని, లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతావని హరీశ్ రావు హెచ్చరించారు.

# పంద్రాగస్టు ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

**హైదరాబాద్, ఆగస్టు 13 :**

పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. గోల్కొండ కోటలో శనివారం నిర్వహించనున్న స్వాతంత్ర్య దిన వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అందరూ సమన్వయంతో పనిచేయాలంటూ శాఖల వారీగా ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, బ్యారికేడింగ్, గ్యాలరీలు, అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రొటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతోపాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పిల్లలు వచ్చే ప్రతి వాహనంలో ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు వేడుకలకు ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పక్కాగా, వేగవంతంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి.ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్.జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, ఫైర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని దోచుకోవడంలో బీఆర్‌ఎస్‌తో పోటీ

**మొదటిపేజీ తరువాయి**

ఆరోపించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు నాణెనికి ఇరువైపులా ఉన్నటువంటివని పేర్కొన్నారు. యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరు ఎకరాలకుపైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్‌ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, బీఆర్‌ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాక మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానన్నారు. మరోవైపు రింగ్ రోడ్డు, ఫార్ములాఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

# మైనారిటీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

**మొదటిపేజీ తరువాయి**

రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్‌ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్‌ఎస్ హయాంలో గ్రూప్1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్1 రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో వోట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి వోటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల వోటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యేక దృష్టితో కూకట్‌పల్లి అభివృద్ధి

**కూకట్‌పల్లి, ఆగస్టు 13 :**



ఆనాడు తాను పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్‌పల్లి ప్రజలు ఆశీర్వదించారు.. అయితే ప్రతిపక్షంలో ఉన్నందున మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కానీ ఇప్పుడు కూకట్‌పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందంటూ మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి అని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును ఆదేశిస్తున్నానన్నారు. పదేళ్ల బీఆరఎస్ పరిపాలనను, ఈ తమ్ముడి రెండేళ్ల తమ పాలనను బేరీజు వేసుకోండని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని, ప్రతీ పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని, ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించామని, ఆర్టీసీలో ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడమేగాక ఆ బస్సులకు య్యువమానులను చేశామని, స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విషయంలో కడుపులో విషం పెట్టుకుని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ప్రభుత్వంపైకి ఉసిగొల్పినా తాము వెనక్కి తగ్గలేదన్నారు. ఆడ బిడ్డలు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించామని, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లిస్తూనే మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్‌కు శ్రీకారం చుట్టిందని, మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన అన్నారు. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని, 22ఏ విషయంలో మీ సొంత భూములు కోల్పోకుండా చూసే బాధ్యత మాది అని హామీ ఇచ్చారు. ఈ విషయంలో మీకు ఆందోళన వద్దని, సోషల్ మీడియాలో కొందరు చేసే అబద్ధపు ప్రచారాన్ని నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. నాకు వయసు ఉంది.. ఓపిక ఉంది.. మీకు మంచి చేయాలన్న సంకల్పం ఉంది.. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని చెప్పారు. కొంతమంది దుర్మార్గులు రాష్ట్రంలో కరవు రావాలని క్షుద్ర పూజలు చేశారని, అయినా దేవుడు మన వైపు ఉన్నాడు.. వర్షాలు కురిపించాడు.. మంచి మనసుతో అభివృద్ధి చేయాలన్న మా సంకల్పానికి దేవుడి ఆశీర్వాదం ఉంది అని సీఎం రేవంత్ చెప్పారు. మీరు అండగా ఉండండి.. అభివృద్ధి చేసి చూపిస్తా అని మరోమారు హామీ ఇచ్చారు.

**వచ్చే బోనాలు ఇందిరమ్మ టవర్స్ నుంచే..**

**– రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన జరిగిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ నుంచే వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కూకట్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమీషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమీషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా రూ.200 కోట్ల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహా నగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని అంటూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని, దీనికి సంబంధించి ఇప్పటివరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని మంత్రి చెప్పారు. ఎలాంటి లాలూచీలు లేకుండా మంత్రులు సహా ఎవరి సిఫారసులు లేకుండా అందరి ముందు లక్కీ డిప్ తీసి పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తామన్నారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలు అందిస్తాం కనుక వారు దగ్గరుండి కాంట్రాక్టర్‌తో తమ ఇళ్లను నాణ్యతతో కట్టించుకోవచ్చని సూచించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల గృహ ప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నరేళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని, అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదన్నారు. అంతేగాక పిట్ట కథలు చెబుతూ పేదలను, పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు ఎమ్మెల్యేలు తమ దృష్టికి తెచ్చారని, అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఓటుకు నోటు కేసు మళ్లీ మొదటికి..

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:**

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సంచలనం రేపిన ఓటుకు నోటు కేసు విచారణ సుప్రీం కోర్టులో మళ్లీ మొదటి దశకు చేరుకుంది. గతంలో ఈ కేసుపై సుదీర్ఘంగా వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. అయితే ఆ బెంచ్‌లోని న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంతో, న్యాయ నిబంధనల ప్రకారం కొత్త ధర్మాసనం ముందు కేసును తిరిగి విచారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

**కొత్త ధర్మాసనం ముందుకు..**

పదేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఓటుకు నోటు కేసుకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో గతంలోనే విస్తృతంగా వాదనలు జరిగాయి. అయితే వాదనలు విన్న న్యాయమూర్తులు పదవీ విరమణ చేయడంతో విచారణ ప్రక్రియ పూర్తికాకుండానే నిలిచిపోయింది. కేసుల కేటాయింపు ప్రక్రియలో భాగంగా ఈ వ్యవహారం సీజేఐ ముందుకు రావడంతో పాత వాదనలను కొనసాగించే అవకాశం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.

**మొదటి నుంచే వాదనలు..**

కొత్త బెంచ్ ఏర్పాటైన తర్వాత పిటిషనర్లు, ప్రతివాదుల తరఫు న్యాయవాదులు తమ వాదనలను మరోసారి వినిపించాల్సి ఉంటుంది. గతంలో సమర్పించిన వాదనలు, న్యాయపరమైన అంశాలను కొత్త ధర్మాసనం స్వయంగా పరిశీలించాల్సి ఉంటుంది. దీంతో కేసు విచారణ మరోసారి పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది.

**రాజకీయ ప్రాధాన్యంతో..**

ఓటుకు నోటు కేసు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో కీలకంగా మారిన నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇన్నాళ్లుగా న్యాయపరమైన ప్రక్రియలో పెద్దగా కదలిక లేకపోవడంతో ఈ కేసుపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి తగ్గినప్పటికీ, తాజా పరిణామంతో మళ్లీ చర్చ మొదలైంది.

**తీర్పు కోసం మరింత సమయం..**

గతంలో వాదనలు పూర్తయినప్పటికీ కొత్త ధర్మాసనం ఏర్పాటు కావడంతో తీర్పు దశకు చేరిన కేసు మళ్లీ విచారణ దశకు వచ్చింది. కొత్త బెంచ్ ఎప్పుడు ఏర్పాటు అవుతుంది, విచారణను ఏ విధంగా కొనసాగిస్తుంది అన్నదానిపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. దీంతో ఓటుకు నోటు కేసు భవిష్యత్ పరిణామాలపై తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి.



# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రంగం సిద్ధం

**హైదరాబాద్, ఆగస్టు 13:**

రాష్ట్ర ప్రభుత్వం కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సిద్ధమైంది. ఈ నెల 15 నుంచి 15 రోజుల పాటు లబ్ధిదారులకు కొత్త కార్డులను అందించనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డు నమూనాను విడుదల చేసింది. ఆధునిక రూపకల్పనతో రూపొందించిన కార్డులో భద్రతతో పాటు కుటుంబానికి సంబంధించిన కీలక సమాచారాన్ని పొందుపరిచారు.

**కార్డుపై కీలక వివరాలు**

స్మార్ట్ రేషన్ కార్డు ముందు భాగంలో సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాలు ఉంటాయి. రేషన్ కార్డు నంబర్, కుటుంబ యజమాని పేరు, రేషన్ షాపు నంబర్ వంటి వివరాలను ముద్రించారు.

**వెనుక భాగంలో హోలోగ్రామ్**


కార్డు దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వెనుక భాగంలో ప్రత్యేక హోలోగ్రామ్ ఏర్పాటు చేశారు. తక్షణ సమాచారాన్ని పొందేందుకు క్యూఆర్ కోడ్‌ను కూడా అందుబాటులో ఉంచారు.

**చిరునామా వివరాలు**

లబ్ధిదారుడి గ్రామం, ప్రాంతం, మండలం, జిల్లా, పూర్తి చిరునామా వివరాలను కార్డులో పొందుపరిచారు. దీంతో కుటుంబ వివరాలను సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది.

**పారదర్శకతకు ప్రాధాన్యం**

కొత్త స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. డిజిటల్ సాంకేతికతను వినియోగించడం ద్వారా లబ్ధిదారులకు సేవలను వేగంగా అందించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.



# గోడ దూకితే గోసకచ్చే..!

మొదటిపేజీ తరువాయి

**అటు పాత పార్టీ.. ఇటు కొత్త గుర్తింపు**

ఫిరాయింపు ఎమ్మెల్యేల పరిస్థితిని పార్టీ మార్పుపై నెలకొన్న చట్టపరమైన పరిణామాలు మరింత సంక్లిష్టం చేశాయి. వీరు కాంగ్రెస్‌లో చేరినట్లు స్పీకర్ అధికారికంగా గుర్తించని నేపథ్యంలో అటు బీఆర్ఎస్‌లో పాత హోదాను కొనసాగించలేక.. ఇటు కాంగ్రెస్‌లో పూర్తిస్థాయి రాజకీయ గుర్తింపు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ చట్టపరమైన, రాజకీయ వేదికలపై తమ పార్టీ మార్పును సమర్థించుకోవాల్సిన పరిస్థితి కూడా వారికి ఇబ్బందిగా మారిందన్న చర్చ సాగుతోంది.

**నిధుల కోసం ఎదురుచూపులు**

కాంగ్రెస్‌లో చేరిన సమయంలో నియోజకవర్గాల అభివృద్ధికి భారీగా నిధులు వస్తాయని, ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు వేగంగా పూర్తవుతాయని పలువురు ఎమ్మెల్యేలు ఆశించారు. అయితే ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదన్న అసంతృప్తి కనిపిస్తోంది. చిన్న చిన్న అభివృద్ధి పనుల కోసం కూడా మంత్రులు, అధికారులను సంప్రదించాల్సి వస్తోందని, తమ విజ్ఞప్తులకు తగిన స్పందన లభించడం లేదని కొందరు ఎమ్మెల్యేలు అనుచరుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

**దానం, పోచారం వ్యాఖ్యలతో కలకలం**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చాయి. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ మారినా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదని పోచారం బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన పనులు కూడా పూర్తిగా అమలు కావడం లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. దానం నాగేందర్ వైఖరిలోనూ మార్పు కనిపిస్తోందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెంచుతోంది.

**పటాన్‌చెరు దారి.. మిగతావారి ఆలోచన**

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కొంతకాలంగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారన్న ప్రచారం ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో ఆయన వర్గం బీఆర్ఎస్ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. దీంతో ఆయన ఇప్పటికే తన రాజకీయ భవిష్యత్తుపై ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలిస్తున్నారన్న ఊహాగానాలు మొదలయ్యాయి. మరోవైపు కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాశ్ గౌడ్ తదితరుల పరిస్థితిపైనా చర్చ జరుగుతోంది. నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ అనుచరులు, స్థానిక నాయకుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

**కాంగ్రెస్‌లోనూ పూర్తి ఆమోదం కరువు**

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు మరో సమస్య స్థానిక కాంగ్రెస్ రాజకీయాలు. కాంగ్రెస్‌లో చేరినా పాత కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు వీరిని పూర్తిగా తమ నాయకులుగా అంగీకరించలేదన్న వాదన ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో పాత, కొత్త వర్గాల మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అధికార పార్టీలో ఉన్నప్పటికీ రాజకీయంగా పూర్తి స్థాయి స్వేచ్ఛ, ప్రాధాన్యత లభించడం లేదన్న భావన ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో పెరుగుతున్నట్లు సమాచారం.

**గులాబీ గూటివైపు చూపులా?**

బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో తీసుకున్న నిర్ణయం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదన్న భావన కొందరిలో బలపడుతున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు కాంగ్రెస్‌లో పూర్తి స్థాయి గుర్తింపు లేకపోవడం.. మరోవైపు బీఆర్ఎస్‌లో గతంలో ఉన్న హోదా, కేడర్‌పై పట్టు కోల్పోవడం వారిని సందిగ్ధంలోకి నెట్టినట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు.. గూడెం మహిపాల్‌రెడ్డి వైఖరి.. ఇతర ఎమ్మెల్యేల నియోజకవర్గ సమస్యలు కలిసి ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తుపై ఆసక్తిని పెంచుతున్నాయి. వీరిలో కొందరు నిజంగానే తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తారా? లేక కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తిని చల్లార్చి వారిని పార్టీలోనే కొనసాగించేలా చర్యలు తీసుకుంటుందా? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారింది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై.. హైకోర్టులో వాదనలు

- **స్పీకర్ తీర్పును సవాలు చేస్తూ పిటిషన్లు**
- **10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోరుతూ విచారణ**
- **స్పీకర్ పరిధి దాటారని పిటిషనర్ల వాదన**
- **వార్తా కథనాలే ఆధారం కాదని కోర్టుకు వివరణ**
- **తదుపరి విచారణ ఈ నెల 17న**

హైదరాబాద్, ఆగస్టు 13:

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో గురువారం సుదీర్ఘ విచారణ జరిగింది. స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారించింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు స్పీకర్ నిర్ణయాన్ని తప్పుబడుతూ పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**స్పీకర్ పరిధిపై అభ్యంతరం**

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం నిర్ణయం తీసుకునే సమయంలో స్పీకర్ చట్టంలో లేని అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదించారు. ప్రభుత్వ స్థిరత్వం, అసెంబ్లీలో పార్టీల బలం, ప్రతిపక్షానికి ఉన్న మద్దతు వంటి అంశాలను పరిశీలించడం స్పీకర్ పరిధిలోకి రాదని పేర్కొన్నారు.

**ప్రజాతీర్పును కాపాడటమే లక్ష్యం**

రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ఉద్దేశం కేవలం అసెంబ్లీలో రాజకీయ సమీకరణాలను నిర్వహించడం కాదని న్యాయవాది తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును పార్టీ ఫిరాయింపుల ద్వారా నిర్వీర్యం కాకుండా చూడటమే దాని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ అంశాన్ని స్పీకర్ తీర్పులో పరిగణనలోకి తీసుకోలేదని వాదించారు.

**పక్కా ఆధారాలిచ్చామని వాదన**

అనర్హత పిటిషన్లలో కేవలం వార్తా కథనాలనే ఆధారంగా చూపలేదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు స్పష్టం చేశారు. ఎన్నికల గెజిట్లు, అధికారిక పత్రాలు, ఫారం26 అఫిడవిట్లను సాక్ష్యాలుగా సమర్పించినట్లు తెలిపారు. వార్తా కథనాల మూలాలు, రిపోర్టర్లు, ఎడిటర్ల వివరాలు లేవన్న కారణంతో పిటిషన్లను తిరస్కరించడం సరికాదని కోర్టుకు వివరించారు.

**10 మంది ఎమ్మెల్యేల వ్యవహారం**

కాలే యాదయ్య, దానం నాగేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, టి.ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, తెల్లం వెంకట్‌రావు, గూడెం మహిపాల్‌రెడ్డి, సంజయ్‌కుమార్‌లపై అనర్హత వేటు కోరుతూ పిటిషన్లు దాఖలయ్యాయి. వీరిపై ఫిరాయింపు ఆరోపణలు ఉన్నప్పటికీ అధికారికంగా పార్టీ మారలేదన్న స్పీకర్ నిర్ణయాన్ని పిటిషనర్లు సవాలు చేస్తున్నారు.

**17న తదుపరి విచారణ**

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్, పల్లె రాజేశ్వర్‌రెడ్డితో పాటు బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ కొనసాగుతోంది. ఇరుపక్షాల ప్రాథమిక వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.

# సీఎం పర్యటన ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

- **అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం**

ములుగు, ఆగస్టు 13 :

జిల్లాలో ఈనెల 16న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని, నూతన కలెక్టరేట్ సముదాయాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రావమ్‌నాథ్ కేకన్‌లతో కలిసి ఆమె గురువారం పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని, ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. పైలాన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనుల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అనంతరం నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి భవనంలోని వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, పరిసరాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్‌తో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలన్నారు. అనంతరం విలేకరులతో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ములుగు నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిపారు. మధ్యాహ్నం సమయంలో మేడారం చేరుకుని శ్రీ సమ్మక్కసారలమ్మ వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. వనదేవతల సన్నిధి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వితంతు మహిళలు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకున్న



వారిని గతంలో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. మేడారం కార్యక్రమాల అనంతరం ముఖ్యమంత్రి జిల్లా కేంద్రానికి చేరుకుని రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా మూడు విడతల్లో సుమారు రూ.16 వేల కోట్లతో చేపట్టనున్న హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్ల పనులకు సంబంధించిన అభివృద్ధి పనుల పైలాన్‌ను గట్టమ్మ సమీపంలో ఆవిష్కరిస్తారన్నారు. తర్వాత ముఖ్యమంత్రి నూతన కలెక్టరేట్‌కు చేరుకుని తొలుత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారని, కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ, జిల్లా ప్రజలు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మంత్రి ఆహ్వానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్.మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్ చందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు

హైదరాబాద్, ఆగస్టు 13 :

బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు పథకాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని తెలిపారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించి వారిని కేవలం ప్రభుత్వ పథకాల లబ్దిదారులుగా కాక స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి వెయ్యి చొప్పున మొత్తం 1.19,లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో మిషన్ విలువ రూ.12,000 కాగా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఈనెల 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

**పేద, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత**

కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ బీసీ మహిళలకు ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి కల్పించడమే ప్రధాన ఉద్దేశమని మంత్రి పొన్నం తెలిపారు. అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, అలాగే కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల మేరకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణను కూడా తప్పనిసరి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పథకాన్ని మరింత విస్తరించి ఎక్కువమందికి ప్రయోజనం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కాగా, బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఆత్మగౌరవ భవనాలకు నిధులు కేటాయిస్తూ వాటి నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. ఇటీవల బలహీనవర్గాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి బీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని చెప్పారు. కులగణన అనంతరం బీసీల అభివృద్ధికి సంబంధించిన తదుపరి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామని మంత్రి పేర్కొన్నారు.

**పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణకు భారీగా తరలిరావాలి**

ఈనెల 14న సాయంత్రం 4 గంటలకు హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. అలాగే ఈనెల 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారని మంత్రి తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల్లో బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మంత్రి పొన్నం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేష్, వివిధ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఈసీఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

మొదటిపేజీ తరువాయి

(సీఈవో) సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని, వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దరఖాస్తు నింపాలని కోరుతున్నారని. బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఈసీఐ, తెలంగాణ ఎలక్షన్ కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని, మోసపూరిత సందేశాలు వస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సుదర్శన్ రెడ్డి సూచించారు.

# డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం

హైదరాబాద్, ఆగస్టు 13 :


రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని గురువారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు పార్టీ రాష్ట్ర నేతలు, పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. వైరా శాసనసభ్యుడు రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, చల్లా నరసింహారెడ్డి, నాయుడు సత్యం, అన్వేష్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పీసీసీ ఉపాధ్యక్షుడు నెమిండ్ల శ్రీనివాస్, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, 'సుడా' చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ జేఏసీ అధ్యక్షుడు లోకేష్ కుమార్ యాదవ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, తమ అభిమాన నాయకుడికి స్వాగతం పలికేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో విమానాశ్రయానికి తరలివచ్చారు. విమానాశ్రయ ప్రాంగణం కార్యకర్తల నినాదాలతో కోలాహలంగా మారింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందరికీ నమస్కరిస్తూ అభివాదం చేశారు.

# ప్రతిష్ఠాత్మకంగా 'ఖేలో ఇండియా' నిర్వహణ

న్యూఢిల్లీ, ఆగస్టు 13 :

డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు ఖేలో ఇండియా క్రీడలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర క్రీడలు, యువజనుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. న్యూఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రిని గురువారం కలిశారు. ఆయనతోపాటు ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి వాకిటి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రికి అందజేశారు. ఖేలో ఇండియా క్రీడల నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తమ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామన్నారు.





# కారు బీభత్సం.. మహిళకు తీవ్ర గాయాలు

- **నిర్మాత కారు ఢీకొని మహిళకు గాయాలు**
- **డ్రైవర్‌పై అబిడ్స్ పోలీసుల కేసు**
- **వైద్య ఖర్చులపై నిర్మాతను సంప్రదించిన కుటుంబం**
- **నిర్లక్ష్యంగా స్పందించారని బాధితుల ఆరోపణ**
- **ప్రమాదంపై కొనసాగుతున్న దర్యాప్తు**

హైదరాబాద్, ఆగస్టు 13:

హైదరాబాద్‌లోని అబిడ్స్ పరిధిలో సినీ నిర్మాత బొమ్మకు మురళికి చెందిన కారు ప్రమాదానికి గురై ఓ మహిళ తీవ్రంగా గాయపడ్డారు. చాపెల్ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న నాంపల్లి ఆండాళమ్మ బస్తీకి చెందిన సునీతను కారు ఢీకొనడంతో ఆమె కాలికి ఫ్రాక్చర్ కావడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**విధులు ముగించుకుని వెళ్తుండగా..**

గన్‌ఫౌండ్రీలోని ఎస్‌బీఐ బ్యాంకులో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీత ఆగస్టు 12న సాయంత్రం విధులు ముగించుకుని చాపెల్ రోడ్డు మీదుగా ఇంటికి వెళ్తున్నారు. ఆ సమయంలో నిర్మాత వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న మహానంద కారును వేగంగా నడుపుతూ ఆమెను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

**వైద్య ఖర్చులపై కుటుంబం విజ్ఞప్తి**

సునీత చికిత్సకు అయ్యే ఖర్చుల కోసం ఆమె కుటుంబ సభ్యులు కారు యజమాని మురళిని ఫోన్‌లో సంప్రదించినట్లు తెలిపారు. అయితే, తమ విజ్ఞప్తికి ఆయన నిర్లక్ష్యంగా, దురుసుగా స్పందించారని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**పోలీసుల దర్యాప్తు**

బాధితురాలి కుటుంబం ఫిర్యాదు ఆధారంగా అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణాలు, కారు నడిపిన వ్యక్తి వ్యవహారం, ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు.

**సినీ నిర్మాతగా గుర్తింపు**

బొమ్మకు మురళి టెక్నోక్రాట్‌గా, సామాజిక, రాజకీయ కార్యకర్తగా పనిచేసిన అనంతరం సినీ నిర్మాతగా మారారు. ఆయన నిర్మించిన 'శరణం గచ్ఛామి' చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదలైంది. భారత రాజ్యాంగం, రిజర్వేషన్ల వ్యవస్థ వంటి అంశాలను ఇతివృత్తంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించారు.

# పిల్లల ఆరోగ్యంతో ఆటలొద్దు

న్యూఢిల్లీ, ఆగస్టు 13 :

అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌ల పై లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్‌స్కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# గందరగోళంలో వర్షా కాల సమావేశాలు..

- బీజేపీ, విపక్షాల పోటాపోటీ నిరసనలు
- చివరి రోజూ కొనసాగిన రాజకీయ ఘర్షణ
- మకర్ ద్వార్ వద్ద ఇరు పక్షాల ఆందోళనలు
- సభ సజావుగా సాగకపోవడంపై పరస్పర ఆరోపణలు
- చర్చలు లేకుండానే నిరవధిక వాయిదా



న్యూఢిల్లీ, ఆగస్టు 13:

జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు తీవ్ర గందరగోళం, రాజకీయ ఘర్షణల మధ్య ముగిశాయి. గురువారం ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే నిరవధికంగా వాయిదా పడ్డాయి. చివరి రోజున కూడా అధికార, విపక్ష సభ్యులు పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద పోటాపోటీగా నిరసనలు చేపట్టడంతో సమావేశాలకు సజావుగా ముగింపు లభించలేదు.

**జాతీయ గీతం తర్వాత వాయిదా**

లోక్‌సభ ప్రారంభమైన వెంటనే జాతీయ గీతం వందేమాతరం ఆరు చరణాలను ఆలపించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సాధారణంగా సమావేశాల చివరి రోజున సభ పనితీరు, ఉత్పాదకతపై స్పీకర్ ముగింపు ప్రసంగం చేస్తారు. అయితే ఈసారి అలాంటి ప్రసంగం లేకుండానే సభ ముగిసింది. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొద్దిసేపు సభలో ఉన్నారు.

**రాహుల్‌పై బీజేపీ నిరసన**

ఝార్ఖండ్‌లో కొనసాగుతున్న ఆందోళనలపై రాహుల్ గాంధీ స్పందించడం లేదని ఆరోపిస్తూ బీజేపీ ఎంపీలు మకర్ ద్వార్ వద్ద నిరసన చేపట్టారు. ప్రజా సమస్యలపై విపక్షం బాధ్యతగా వ్యవహరించకుండా సభా కార్యకలాపాలను అడ్డుకుంటోందని విమర్శించారు. దీనికి ప్రతిగా కాంగ్రెస్ సహా విపక్ష ఎంపీలు కూడా అక్కడే ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేడా నేతృత్వంలోని నిరసనలో కోతి బొమ్మను ప్రదర్శిస్తూ చేసిన నినాదాలు వివాదానికి దారితీశాయి.

**సభ నడపడం ప్రభుత్వ బాధ్యత**

పార్లమెంట్ కార్యకలాపాలు సజావుగా సాగకపోవడానికి విపక్షాలను బాధ్యులను చేయడం సరికాదని ప్రతిపక్ష ఎంపీలు అన్నారు. సభను నిర్వహించే బాధ్యత ప్రభుత్వానిదేనని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్ పేర్కొన్నారు. ఝార్ఖండ్ అంశంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాధానం కోరినా స్పందన రాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా కూడా చర్చలకు ప్రభుత్వం ముందుకు రాలేదని విమర్శించారు.

**విపక్షమే అడ్డుకుంటోందన్న బీజేపీ**

మరోవైపు సభా కార్యకలాపాలకు విపక్షమే ఆటంకం కలిగిస్తోందని బీజేపీ ఆరోపించింది. రాహుల్ గాంధీ సభను అడ్డుకునే వైఖరి అవలంబిస్తున్నారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. పార్లమెంటరీ వ్యవస్థ నిబంధనల ప్రకారమే నడుస్తుందని, దాన్ని వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చలేరని అన్నారు.

**వరుస అంతరాయాలతో సమావేశాలు**

వర్షాకాల సమావేశాల ప్రారంభం నుంచే నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జ్, అయోధ్య విరాళాల వ్యవహారం సహా పలు అంశాలపై విపక్షాలు నిరసనలు చేపట్టాయి. మరోవైపు ఝార్ఖండ్ ఆందోళనలపై రాహుల్ గాంధీ స్పందించాలంటూ బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. సభ లోపల, వెలుపల ఇరు పక్షాల నిరసనలతో తరచూ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. చివరి రోజూ అదే పరిస్థితి కొనసాగడంతో ఎలాంటి కీలక చర్చలు లేకుండానే సమావేశాలకు తెరపడింది.

# ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

- ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 13 :

ఢిల్లీలో 2025 నవంబరులో జరిగిన పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తులో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# రాంచీలో విద్యార్థుల ఆందోళన ఉధృతం

- పరీక్షల అక్రమాలపై 20 రోజులుగా నిరసనలు
- అసెంబ్లీ ముట్టడికి యత్నించిన వారిపై పోలీసుల లాఠీఛార్జ్
- 600 మందిపై ఎఫ్ఐఆర్.. బీజేపీ బంద్‌తో వేడెక్కిన రాజకీయం
- సీబీఐ విచారణకు డిమాండ్.. ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఒత్తిడి
- విద్యార్థులతో ఆరు విడతల చర్చలు విఫలం

రాంచీ, ఆగస్టు 13:

జార్ఖండ్‌లో నియామక పరీక్షల నిర్వహణపై విద్యార్థుల ఆందోళన తీవ్ర రూపం దాల్చింది. పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 'JPSCJSSC రిఫార్మ్స్ మంచ్' ఆధ్వర్యంలో రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో చేపట్టిన నిరసన గురువారానికి 20వ రోజుకు చేరింది. పరీక్షల్లో పారదర్శకత పాటించాలని, గతంలో నిర్వహించిన కొన్ని పరీక్షలను రద్దు చేయాలని, మొత్తం వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**అసెంబ్లీ ముట్టడికి యత్నం**

గురువారం అసెంబ్లీ వైపు మార్చ్ చేపట్టిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో లాఠీఛార్జ్ చేయడంతో పాటు వాటర్ కెనన్లు, భాష్పవాయు గోళాలను ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించారన్న ఆరోపణలతో సుమారు 600 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 100 మందిని పేర్లతో, మరో 500 మందిని గుర్తుతెలియని నిరసనకారులుగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నట్లు సమాచారం.

**బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్**

విద్యార్థులపై పోలీసుల చర్యను నిరసిస్తూ బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది. ప్రభుత్వం ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తోందని పార్టీ నేతలు ఆరోపించారు. నియామక పరీక్షల వ్యవహారంపై వారం రోజుల్లోగా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ హెచ్చరించారు. 2024 ఎక్సైజ్ కానిస్టేబుల్ శారీరక పరీక్షల సందర్భంగా మృతి చెందిన 19 మంది అభ్యర్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ఎస్ఐటీపై ఏబీవీపీ అనుమానాలు**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందంలో సభ్యులను పలుమార్లు మార్చడంపై ఏబీవీపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. దర్యాప్తు విశ్వసనీయతపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ దేశవ్యాప్తంగా 1,200కు పైగా విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలు చేపడతామని ప్రకటించింది.

**బీజేపీపై అధికార పక్షం ఎదురుదాడి**

విద్యార్థుల ఆందోళనను బీజేపీ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటోందని అధికార పక్షం ఆరోపించింది. ఉద్యమాన్ని హింసాత్మకంగా మార్చేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వ్యక్తులను తీసుకొచ్చి ఉద్రిక్తత సృష్టిస్తున్నారని ప్రత్యారోపణలు చేసింది. దీంతో నియామక పరీక్షల వివాదం రాజకీయ రంగు పులుముకుంది.

**ఆరు విడతల చర్చలు విఫలం**

సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం, విద్యార్థి ప్రతినిధుల మధ్య ఆరు దఫాలుగా చర్చలు జరిగినా ఏకాభిప్రాయం కుదరలేదు. పరీక్షల సంస్కరణలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తెలిపారు. విద్యార్థుల అభ్యర్థన మేరకు 14వ జేపీఎస్సీ పరీక్షను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే బీజేపీ రాజకీయ లబ్ధి కోసం ఉద్యమాన్ని ఉపయోగించుకుంటోందని ఆయన విమర్శించారు.

# మాజీ మావోయిస్టుల క్యాట్‌వాక్..

- ర్యాంప్‌పై సందడి చేసిన మాజీ మహిళా మావోయిస్టులు
- చేనేత దుస్తుల్లో ఆత్మవిశ్వాసంతో అడుగులు

రాయ్‌పూర్, ఆగస్టు 14:

ఒకప్పుడు దట్టమైన అడవుల్లో ఆయుధాలతో తిరిగిన మాజీ మహిళా మావోయిస్టులు ఇప్పుడు చేనేత వస్త్రాలతో ర్యాంప్‌పై సందడి చేశారు. ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారు రాయ్‌పూర్‌లో నిర్వహించిన ఫ్యాషన్ షోలో మోడళ్లుగా పాల్గొని క్యాట్‌వాక్ చేశారు. వారి ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రదర్శన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**చేనేత దుస్తుల్లో..**

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ఫ్యాషన్ షోలో మాజీ మహిళా మావోయిస్టులు సంప్రదాయ చేనేత వస్త్రాలు ధరించి ర్యాంప్‌పై నడిచారు. చిరునవ్వులతో, ధైర్యంగా అడుగులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సభికులు చప్పట్లతో వారిని అభినందించారు.

**సీఎం విష్ణుదేవ్ సాయ్ హాజరు**

ఈ కార్యక్రమానికి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ హాజరయ్యారు. చేనేత వారసత్వాన్ని కాపాడుతూ ముందుకు తీసుకెళ్తున్న వారిని ఆయన అభినందించారు. హింసకు దూరమై సాధారణ జీవితం గడుపుతున్న మాజీ మావోయిస్టుల ప్రదర్శన వేడుకలో ప్రత్యేకంగా నిలిచింది.

**సోషల్ మీడియాలో వైరల్**

మాజీ మహిళా మావోయిస్టులు ర్యాంప్‌పై క్యాట్‌వాక్ చేసిన దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వారి జీవితాల్లో వచ్చిన మార్పును నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. హింసను వీడి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించిన వారికి ఇలాంటి అవకాశాలు కల్పించడం స్ఫూర్తిదాయకమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**కొత్త జీవితానికి ప్రతీకగా..**

గతంలో అడవుల్లో తుపాకులు పట్టిన మహిళలు ఇప్పుడు చేనేత వస్త్రాల్లో ర్యాంప్‌పై ఆత్మవిశ్వాసంతో నడవడం వారి పునరావాస ప్రయాణానికి ప్రతీకగా నిలిచింది. సాధారణ జీవనంలోకి తిరిగి వచ్చిన వారికి సామాజికంగా అవకాశాలు కల్పిస్తే వారు తమ ప్రతిభను చాటుకోగలరని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

# ఆప్‌లో నా మాటకు విలువ లేకే బీజేపీలో చేరా

ఇంటర్నెట్ డెస్క్, ఆగస్టు 14:

ఆమ్ ఆద్మీ పార్టీలో తన సూచనలకు ప్రాధాన్యం దక్కకపోవడంతోనే పార్టీని వీడి బీజేపీలో చేరానని మాజీ క్రికెటర్, రాజ్యసభ సభ్యుడు హర్భజన్ సింగ్ తెలిపారు. క్రీడల అభివృద్ధికి కృషి చేయాలనే ఉద్దేశంతోనే ఆప్‌లో చేరానని, అయితే తన ఆలోచనలను పార్టీ నాయకత్వం పట్టించుకోకపోవడంతో బయటకు రావాల్సి వచ్చిందని ఓ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో హర్భజన్‌తోపాటు మరో ఆరుగురు ఆప్ రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరారు.

**క్రీడల కోసమే రాజకీయాల్లోకి**


రాజ్యసభలో ఆప్ తరఫున ప్రాతినిధ్యం వహించాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తనను ఆహ్వానించారని హర్భజన్ తెలిపారు. రాజకీయ అంశాల జోలికి వెళ్లకుండా క్రీడలకు సంబంధించిన విషయాలపైనే పనిచేస్తానని అప్పుడే స్పష్టం చేసినట్లు చెప్పారు. పంజాబ్‌తో పాటు దేశవ్యాప్తంగా క్రీడలను ప్రోత్సహించే అవకాశం లభిస్తుందనే ఉద్దేశంతోనే ఆప్‌లో చేరానన్నారు.

**సూచనలను పట్టించుకోలేదు**

క్రీడలకు సంబంధించి తాను చేసిన సూచనలను పార్టీ నాయకత్వం పట్టించుకోలేదని హర్భజన్ ఆరోపించారు. కనీసం ఒక్క సూచననైనా అమలు చేసి ఉంటే పార్టీని వీడాల్సిన అవసరం ఉండేది కాదన్నారు. తన మాటకు విలువ లేకపోవడం వల్లే రాజకీయంగా మరో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

**ద్రోహి అంటూ విమర్శలపై ఆగ్రహం**

ఆప్‌ను వీడిన తర్వాత తనపై పార్టీ నేతలు విమర్శలు చేయడాన్ని హర్భజన్ తప్పుబట్టారు. తన ఇంటి వద్ద నిరసనలు చేపట్టి దిష్టిబొమ్మ దహనం చేయడంపై స్పందిస్తూ.. తాను ఎవరినీ మోసం చేయలేదన్నారు. క్రికెట్ వల్లే ప్రజలు తనను అభిమానించారని, పంజాబ్ కోసం పార్టీ చేసిన పనులపై ముందుగా సమాధానం చెప్పాలని వ్యాఖ్యానించారు.




# నల్సార్ విద్యార్థులపై బీసీఐ వెనక్కి

- సీజేఐ ఆహ్వానంపై విద్యార్థుల అభ్యంతరం
- ఎన్‌రోల్‌మెంట్‌పై ఆంక్షలు ఎత్తివేత
- విద్యార్థులపై చర్యలు ఉండవని స్పష్టత
- వైస్‌ఛాన్సలర్ నుంచి నివేదిక కోరిన బీసీఐ
- తొలి నిర్ణయాన్ని ప్రశ్నించిన కేకే వేణుగోపాల్
- సీజేఐ ఆహ్వానాన్ని వ్యతిరేకించిన 450 మంది విద్యార్థులు

హైదరాబాద్, ఆగస్టు 13:

నల్సార్‌లో 2026లో న్యాయ విద్య పూర్తి చేసిన విద్యార్థుల అడ్వొకేట్ ఎన్‌రోల్‌మెంట్‌పై విధించిన ఆంక్షలను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) వెనక్కి తీసుకుంది. యూనివర్సిటీ కాన్వొకేషన్‌కు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని కొందరు విద్యార్థులు వ్యతిరేకించిన నేపథ్యంలో బీసీఐ తొలుత కఠిన ఆదేశాలు జారీ చేసింది. అయితే, కొన్ని గంటల్లోనే ఆ నిర్ణయాన్ని సవరించి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ఆంక్షలను తొలగించింది.

**తొలి ఆదేశాలతో కలకలం**

2026లో నల్సార్ నుంచి న్యాయ విద్య పూర్తి చేసిన ఏ విద్యార్థినీ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఏ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లోనూ అడ్వొకేట్‌గా ఎన్‌రోల్ చేయరాదని బీసీఐ తొలుత ఆదేశించింది. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమైంది. అయితే అనంతరం జారీ చేసిన సవరించిన ఉత్తర్వుల్లో విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని బీసీఐ స్పష్టం చేసింది.

**వైస్‌ఛాన్సలర్ నుంచి నివేదిక**

కాన్వొకేషన్ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని నల్సార్ వైస్‌ఛాన్సలర్‌ను బీసీఐ కోరింది. కొందరు అధ్యాపకులు, బయటి వ్యక్తులు విద్యార్థులను ప్రేరేపించారని బీసీఐ ఆరోపించింది. విద్యార్థులు అమాయకులని పేర్కొంటూ, విచారణలో ఎలాంటి క్రమశిక్షణ ఉల్లంఘన లేదని తేలితే ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

**తొలి నిర్ణయంపై అభ్యంతరాలు**

మాజీ అటార్నీ జనరల్, సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ బీసీఐ తొలి నిర్ణయాన్ని ప్రశ్నించారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయకుండా నిరోధించే అధికారం బీసీఐకి లేదని పేర్కొన్నారు. దీంతో ఈ వ్యవహారం విద్యార్థుల భావప్రకటనా స్వేచ్ఛకు సంబంధించిన అంశంగానూ చర్చకు వచ్చింది.

**సీజేఐ ఆహ్వానంపై నిరసన**

నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన 450 మందికి పైగా విద్యార్థులు యూనివర్సిటీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కాన్వొకేషన్‌కు జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కోరారు. యువతను బొద్దింకలతో పోల్చడం, జంతర్ మంతర్ నిరసనల సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై చేసిన వ్యాఖ్యలను వారు ప్రస్తావించారు.

**విద్యార్థులపై చర్యలు లేవు**

తొలి ఉత్తర్వులతో ఏర్పడిన పరిస్థితిని బీసీఐ గంటల వ్యవధిలోనే సవరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌కు ఎలాంటి ఆంక్షలు లేవని స్పష్టం చేసింది. అయితే కాన్వొకేషన్ వివాదంపై యూనివర్సిటీ నుంచి నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# విదేశాంగ విధానంపై రాహుల్ సెటైర్లు

- కౌగిలింతలతో దౌత్యం కాదంటూ ప్రధాని మోదీపై విమర్శలు
- సందీప్ దీక్షిత్‌తో వేదికపైనే రాహుల్ కౌగిలింత
- మెలోనీ ప్రస్తావనతో వైరల్‌గా మారిన వ్యాఖ్యలు
- సోషల్ మీడియాలో వీడియోపై భిన్న స్పందనలు



న్యూఢిల్లీ, ఆగస్టు 13:

కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సెటైర్లు వేశారు. ఇతర దేశాల నేతలను కౌగిలించుకోవడమే విదేశాంగ విధానం కాదంటూ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి విమర్శించారు. ఢిల్లీలోని మావలాంకర్ హాల్‌లో గురువారం జరిగిన 'రచనాత్మక కాంగ్రెస్' జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**కౌగిలింతతో వ్యంగ్యం**

విదేశాంగ విధానంపై మాట్లాడిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను వేదిక పైకి పిలిచారు. అనంతరం ఆయనను కౌగిలించుకుంటూ ప్రధాని మోదీ విదేశాంగ విధానాన్ని వ్యంగ్యంగా ప్రస్తావించారు. కేవలం ఇతర దేశాల నేతలను కౌగిలించుకోవడం ద్వారా దౌత్య విధానాన్ని నిర్వచించలేమని వ్యాఖ్యానించారు.

**మెలోనీ ప్రస్తావనతో నవ్వులు**

ఈ సందర్భంగా సందీప్ దీక్షిత్ ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ పేరును ప్రస్తావించారు. రాహుల్‌ను ఉద్దేశించి ఓ ప్రశ్న వేయడంతో సభలో నవ్వులు వెల్లువెత్తాయి. దీనికి రాహుల్ కూడా సరదాగా స్పందించారు. ఈ సంభాషణకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

**విదేశాంగ విధానంపై విమర్శలు**

ప్రధాని మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంలో వ్యక్తిగత దౌత్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నది రాహుల్ గాంధీ విమర్శల ప్రధాన ఉద్దేశంగా కనిపించింది. అంతర్జాతీయ సంబంధాలను కేవలం నేతల మధ్య వ్యక్తిగత సమావేశాలు, కౌగిలింతలతో చూడకుండా విధానాలు, ఫలితాల ఆధారంగా అంచనా వేయాలని ఆయన వ్యాఖ్యల ద్వారా సూచించారు.

**రాజకీయంగా దుమారం**

రాహుల్ వ్యాఖ్యలు, మెలోనీ ప్రస్తావనపై అధికార పక్ష నేతలు విమర్శలు గుప్పించారు. విదేశాంగ విధానంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ప్రతిపక్షానికి హక్కు ఉన్నప్పటికీ, వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ నేతలు పేర్కొన్నారు. దీంతో 'రచనాత్మక కాంగ్రెస్' వేదికగా జరిగిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# ప్రశాంత్ నగర్‌లో భక్తి శ్రద్ధలతో ఎల్లమ్మ పూజలు

**రాయదుర్గం, రాజముద్ర న్యూస్:**

రాయదుర్గం పరిధిలోని ప్రశాంత్ నగర్‌లో శ్రీను – అరుణ దంపతుల ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి పూజలు, ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుండే భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు చప్పుళ్లు, భక్తి నినాదాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వరకు వెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు మేకపోతు బలి ఇచ్చి, బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవంలో ఆందాలమ్మ, శివశక్తులు రంగంలోకి వచ్చి భవిష్యత్ వాణిని వెల్లడించడంతో భక్తులు పులకించిపోయారు. సంప్రదాయ నృత్యాలు, భవిష్యత్ విన్యాసాలతో ప్రశాంత్ నగర్ మొత్తం జాతర శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో బొగ్గులు, డప్పుల సప్పుళ్ల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజలో పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చివరగా అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు.





# కేంద్ర ప్రభుత్వ ప్రజా, రైతు కార్మిక వ్యతిరేక పాలనను నిరసించండి

- జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయండి
- ప్రజా చైతన్య యాత్రకు సంబంధించిన గోడపత్రిక విడుదల
- సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నియోజకవర్గం ఇన్చార్జి కె రామస్వామి



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ చేవెళ్ల నియోజకవర్గం కౌన్సిల్ సమావేశము సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నియోజకవర్గ ఇన్చార్జి కె రామస్వామి హాజరై మాట్లాడుతూ... కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలలను నిరసించాలని, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు ఈనెల 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా యాత్ర కొనసాగుతుందని, ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని, సార్వత్రిక విద్య ఆరోగ్యం అందుబాటులోకి తేవాలని, మహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని, పంటలకు కనీసం మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించాలని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించి తక్షణమే పూర్తి చేయాలన్నారు. భూదాన్ భూములను కాపాడాలని, అన్యాక్రాంతమవుతున్న చెరువులు, కుంటలను పరిరక్షించాలని, గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు ఇచ్చి ఇల్లు, నిర్మించని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా ప్రజా చైతన్య యాత్రలు జరుగుతున్నాయని, ఈ ప్రజా చైతన్య యాత్ర ఈ నెల 17వ తేదీన చేవెళ్ల మండల కేంద్రంలో ప్రారంభం అవుతుందని, ఈ ప్రజా చైతన్య యాత్రను ప్రారంభించడానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నారని తెలిపారు. అదేవిధంగా ప్రజా చైతన్య యాత్ర సభ ఉంటుందని, ప్రజా చైతన్య యాత్ర సభను విజయవంతం చేయుటకు పార్టీ శ్రేణులు, కార్మికులు, కర్షకులు, పార్టీ శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రజా చైతన్య యాత్ర లో విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తదనంతరం ప్రజా చైతన్య యాత్రకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు వడ్ల మంజుల, ఎండి మక్బూల్, ఎం సుధాకర్ గౌడ్, జై అంజయ్య, నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ కార్యదర్శులు ఏం సత్తిరెడ్డి, పాలమాకుల శ్రీశైలం, కె శ్రీనివాస్, సుధీర్, ఏఐటియుసి మండల అధ్యక్షుడు బాబురావు, నియోజకవర్గ కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

# నూతన ట్రాన్స్ఫర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే యాదయ్య

**విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టే దిశగా అడుగులు**



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్, సింగపూర్ శివారు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఊరట లభించింది. ఎమ్మెల్యే కాలే యాదయ్య చొరవతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో వ్యవసాయ విద్యుత్ సరఫరాను బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. ఏళ్లుగా లోవోల్టేజీ, తరచూ విద్యుత్ అంతరాయాలతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం చూపేలా ఈ చర్య చేపట్టడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోతే రైతుల శ్రమ, పెట్టుబడులు తీవ్రంగా దెబ్బతింటాయి. ఈ నేపథ్యంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ సరఫరాలో స్థిరత్వం తీసుకురావడంతో పాటు వ్యవసాయ మోటార్ల నిర్వహణలో ఎదురవుతున్న అవాంతరాలను తగ్గించే అవకాశం ఏర్పడింది. రైతుల అవసరాలను నిర్లక్ష్యం చేయకుండా సమస్యను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే యాదయ్యకు స్థానిక రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు చెగుర్త గోపాల్ రెడ్డి, శంకర్ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, 1వ వార్డు కౌన్సిలర్ ఆనంద్ రావు ఎర్ర, 8వ వార్డు కౌన్సిలర్ పీచరి అఖిల యాదిరెడ్డి, 13వ వార్డు కౌన్సిలర్ అశోక్ పాల్గొన్నారు. విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్, లైన్‌మెన్ మహేందర్‌తో పాటు పార్శి బాలకృష్ణ, మోయిన్, బీర్ల పాండు, బీర్ల ఆంజనేయులు, చాకలి రాములు, చాకలి మల్లేశం, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పూర్తయిన నేపథ్యంలో ఇకపై విద్యుత్ సరఫరాలో తలెత్తే లోపాలపై అధికారులు తక్షణమే స్పందించాలని రైతులు కోరారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడం ద్వారా రైతాంగానికి భరోసా కల్పించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖపై ఉందని పేర్కొన్నారు. స్థానిక సమస్యను గుర్తించి సంబంధిత శాఖతో సమన్వయం చేస్తూ పరిష్కారం చూపడం అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధుల బాధ్యతను స్పష్టం చేస్తోంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌తో ఫతేపూర్, సింగపూర్ శివారు ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ మరింత పటిష్టం అవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బోనాల పండుగ భద్రతలో పోలీసుల పనితీరు భేష్...

- మున్సిపల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రమౌళి, వెంకట్ రెడ్డి
- శంకర్ పల్లి సిఐ రుద్రవీర్‌కు ఘన సన్మానం

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** బోనాల పండుగ భద్రత విషయంలో శంకర్ పల్లి పోలీసుల పనితీరు మరువలేనిదని, భద్రత విషయంలో ఎక్కడ రాజీ పడకుండా వారు అందించిన సహకారానికి కృతజ్ఞతలని శంకర్ పల్లి మున్సిపల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మడపతి చంద్రమౌళి, బొల్లారం వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రోజు శంకర్ పల్లి సిఐ రుద్రవీర్ మున్సిపల్ పరిధిలోని భవానీనగర్ పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, భవానీనగర్ కాలనీ పెద్దలు, భక్తులు సిఐ రుద్రవీర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా పోలీస్ శాఖ అందించిన సహకారానికి కృతజ్ఞతలు వారు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకలు, ఆలయ పరిసరాల్లో భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సిఐ రుద్రవీర్ పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా బోనాల వేడుకలు ప్రశాంతంగా కొనసాగాయని ఆలయ కమిటీ పేర్కొంది. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల కృషిని ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి, మడపతి చంద్రశేఖర్, భవానీనగర్ పెద్దలు బాలాచారి, లక్ష్మయ్య, నర్సింలు, లష్కర్ నరసింహారెడ్డి, రాజన్న



కృష్ణారెడ్డి, రామచంద్రయ్య, గాజుల ప్రభాకర్, ముకుందం గౌడ్, నరేందర్ గౌడ్, టీచర్ ప్రేమ్‌కుమార్, టీచర్ రాములు, కౌన్సిలర్లు ఆనంద్‌రావు ఎర్ర, వాకిటోళ్ల గణేష్, శ్రీరాజన్న వసంత మహేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# పొలంలో నవజాత శిశువు మృతదేహం కలకలం

**అబార్షన్ చేసి పడేసారా? పోలీసు, వైద్యశాఖ విచారణ**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** పాలేరు: కూసుమంచి మండలంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని శివాలయం పరిసరాల్లో, రజక బజార్ వెనుక గల పొలంలో నవజాత మగ శిశువు మృతదేహం లభ్యమైంది.

**రైతు గుర్తించి పోలీసులకు సమాచారం**

గురువారం ఉదయం స్థానిక రైతు నెల్లూరి వెంకటేశ్వర్లు తన పొలం దున్నుతుండగా శిశువు మృతదేహం కనిపించింది. వెంటనే ఆయన పోలీసులు, వైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న కూసుమంచి ఎస్ఐ దివ్యశ్రీ, మండల వైద్యాధికారి డాక్టర్ సాయి కుమార్ సంఘటనా స్థలానికి



చేరుకుని పరిశీలించారు. ఎం ఎన్ ఎం, ఆశా కార్యకర్తల ద్వారా సమాచారం అందడంతోనే ఘటనాస్థలికి వచ్చినట్లు డాక్టర్ సాయి కుమార్ తెలిపారు. ప్రాథమిక పరిశీలనలో ఎవరో ఇంటి వద్దే అబార్షన్ చేయించుకుని, మృత గర్భస్థ శిశువును పొలాల్లో పడేసి ఉండవచ్చు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే శిశువు మృతికి అసలు కారణం ఏమిటి? అబార్షన్ ఎక్కడ, ఎవరి ద్వారా జరిగింది? మృతదేహాన్ని పొలాల్లోకి ఎవరు తీసుకొచ్చి పడేశారు? అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.

**పోస్టుమార్టం తర్వాతే క్లారిటీ**

పోలీసులు ఘటనాస్థలిలో పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు డాక్టర్ సాయి కుమార్ వెల్లడించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే శిశువు వయస్సు, మరణానికి గల కారణాలు, ఇతర అంశాలపై పూర్తి స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాముఖ్యత

- మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ షాబాద్ సోనియా దర్శన్
- విద్యార్థుల ఇబ్బంది గుర్తించి సీలింగ్ ప్యాన్లు అందజేత




**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** విద్యార్థుల ఆరోగ్యంతో పాటు, వారి సంక్షేమం ముఖ్యమని మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ షాబాద్ సోనియా దర్శన్ పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మున్సిపాలిటీ చిలుకూరు ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ షాబాద్ సోనియా దర్శన్, వైస్ చైర్మన్ గరుగు రాజు, కౌన్సిలర్లు సదువు శ్రీలత రామచందర్, కళ్లెంల జగపతి బాబు,అనసూయ నరసింహ, గునుగుర్తి శిరీష కిరణ్, పాఠశాల విద్యార్థుల వైద్య పరీక్షలు పరిశీలించి, మందులు పంపిణీ చేయడం జరిగింది. పాఠశాలలో ఫ్యాన్స్ లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బంది గుర్తించి 20 సీలింగ్ ఫ్యాన్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు షాబాద్ దర్శన్, సదువు రామచందర్, గునుగుర్తి కిరణ్, గౌర యాదగిరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు సఫారీ వాహనం పట్టివేత

**13 క్వింటాళ్ల బియ్యం సీజ్ - రాయగూడెం వ్యక్తిపై కేసు**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి: పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపుపై నేలకొండపల్లి పోలీసులు గురువారం ఉదయం చేపట్టిన తనిఖీల్లో సఫారీ వాహనాన్ని పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో సఫారీ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 26 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. మొత్తం సుమారు 13 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు అధికారులు తెలిపారు. పోలీసులు అక్రమంగా తరలిస్తున్న సఫారీ వాహనాన్ని స్వాధీనం చేసుకుని, బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి రాయగూడెం గ్రామానికి చెందిన సురేష్ పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ముందస్తు సమాచారంతో చర్యలు చేపట్టి బియ్యం అక్రమ తరలింపును అడ్డుకున్నామన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మోర పద్మ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి సంభాని



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండ పల్లి మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన మోర పద్మ కుటుంబాన్ని గురువారం రాష్ట్ర మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పరామర్శించారు. నేలకొండపల్లి మండల కేంద్రంకు చెందిన మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోర మల్లయ్య సతీమణి పద్మ ఇటీవల మృతి చెందింది.విషయం తెలుసుకుని ఆమె నివాసం కు వెళ్లి చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి ని తెలియజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు,మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు. చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, నల్లాని మల్లిఖార్జురావు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదు



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** దూల్ పేట నుండి గంజాయి కొనుగోలు చేసి మియా ఖాన్ గడ్డ పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పట్టుకొని, కేసు నమోదు చేసిన సంఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మోకిల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హిమాంషు తివారి, తండ్రి పేరు రామేశ్వర్ తివారి, వయస్సు 24 సంవత్సరాలు, ప్రస్తుత నివాసం జుమేరత్ బజార్, దూల్‌పేట్, హైదరాబాద్, సొంత చిరునామా సాత్నా జిల్లా, మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి. సదరు వ్యక్తి సాయంత్రం దూల్‌పేట్‌లోని బల్లు వద్ద సుమారు 120 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి, గురువారం సాయంత్రం మేకనుగడ్డ పరిసర ప్రాంతాల్లో విక్రయించడానికి వస్తున్నాడని ఖచ్చితమైన సమాచారం అందడంతో సదరు వ్యక్తిని పట్టుకొని, అతని వద్ద ఉన్న సుమారు 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేయడం జరిగిందని మోకిల పోలీసులు తెలిపారు. అలాగే అతను ఉపయోగించిన బైక్‌ను కూడా సీజ్ చేయడం జరిగిందని మోకిల పోలీసులు తెలిపారు.

## సిమెంటు ట్యాంకర్ బైక్ ఢీ యువకునికి గాయాలు

**ఢీ కొట్టి వెలుతున్న సిమెంటు ట్యాంకర్ ను పోలీసులకు అప్పగించిన ఎమ్మార్పీఎస్ లీడర్ ఆనంద్**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** సిమెంట్ ట్యాంకర్ బైకు డి కొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎమ్మార్పీఎస్ లీడర్ ఆనంద్, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతగిరి హిల్స్ మూలమలుపు ప్రదేశంలో సిమెంటు ట్యాంకర్, బైక్ ఢీకొనగా యువకునికి గాయాలైనట్లు తెలిపారు. కెరలి నుండి వికారాబాద్ వెళ్లే రోడ్డు మార్గంలో బుగ్గ రామలింగేశ్వర టెంపుల్ రోడ్డు మలుగు ప్రదేశంలో ఈ సంఘటన చోటు చేసుకోవడం జరిగిందన్నారు. గాయలకు గురైన వ్యక్తి ఎం రాములు(30) కొండాపూర్ కుర్దు గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిపారు. బైకును ఢీ కొట్టి సిమెంటు ట్యాంకర్ ఆపకుండా పారిపోతుండడంతో ఎమ్మార్పీఎస్ లీడర్ పి ఆనంద్ సిమెంట్ ట్యాంకర్ ను, లారీ డ్రైవర్ ను వికారాబాద్ పోలీస్ స్టేషన్ లో అప్పగించడం జరిగిందని తెలిపారు.

## ఆరోగ్య ఉపకేంద్రంలో నాణ్యమైన వైద్య సేవలు అందించలి

**వికారాబాద్ జిల్లా వైద్యశాఖ ఆరోగ్య అధికారి కె సుధాకర్ లాల్**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా ధరూర్ మండల పరిధిలోని నాగసముందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుక్కింద గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర ప్రారంభం అనంతరం కుక్కింద గ్రామంలో ఉన్నత పాఠశాలలోని విద్యార్థినిలకు సర్వైకల్ క్యాన్సర్ రక్షణ కోసం వేసే హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. వైద్య సిబ్బంది తరచుగా పాఠశాలను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం అవగాహన కార్యక్రమాలతో పాటు, ఏవైనా చిరు వ్యాధులు ఉన్నట్లయితే చికిత్సలు అందించాలని సూచించారు.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే సుధాకర్ లాల్ మాట్లాడుతూ సబ్ సెంటర్ పరిధిలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు వినియోగించుకోవాలని, సిబ్బంది అందరూ కూడా సేవాగుణంతో ప్రజలకు వైద్య సేవలో అందించాలని ముఖ్యంగా గర్భిణీలు, చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా సేవలు అందించాలని, వాటి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శాంతి, సిబ్బంది పాల్గొన్నారు

## పాంపొండ్ కు ముగ్గు పోసిన సర్పంచ్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో జలసిరి లో భాగంగా మైస పోచయ్య పొలంలో పాంపొండ్ కు ముగ్గు పోచారు, కార్యక్రమంలో సర్పంచ్ తాండ్ర మనీషా రామస్వామి, ఏపీవో ధర్మ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బండి నరేష్, ఎఫ్ ఏ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## కన్నాపూర్ బ్రిడ్జి పనులు, తారు రోడ్డు సాంక్షన్ చేసిన ఎమ్మెల్యే



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామానికి బ్రిడ్జి పనులు, తారు రోడ్డు ఎమ్మెల్యే మదన్మోహన్ సాంక్షన్ చేశారని కన్నాపూర్ సర్పంచ్ గొల్ల మహేష్, కన్నాపూర్ తండా సర్పంచ్ మంగి గోవింద నాయక్ తెలిపారు, తారు రోడ్డు కొలతలను పి ఆర్ డి ఈ బాల్ లింగం, ఏ ఈ సురేష్ కొలతలు కొలిచి మార్కింగ్ చేశారు, ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రశాంత్, హరీష్, యూత్ అధ్యక్షులు చెన్నం శెట్టి రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన ఏఈఓ రాకేష్ కు సన్మానం



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలో పనిచేసి బదిలీపై వెళ్లిన వ్యవసాయ విస్తీర్ణ అధికారి బాల్ దేవ్ రాకేష్ కు ఏవో భాను శ్రీ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రాకేష్ మినుకుల, రాణి, శిల్ప మెమొంటో అందజేసి శాలువాతో సన్మానించారు.

# 25 లక్షలతో నూతన భవనాన్ని ప్రారంభించిన స్పీకర్

- ఆధునిక పరికరాల ఏర్పాటుకు భారీ ఎత్తున నిధులు
- రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద ఎత్తున నిధులు
- రైతులకు సంక్షేమ పథకాలు
- తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్





**వికారాబాద్, రాజముద్ర న్యూస్:**

వికారాబాద్ జిల్లా పరిధిలోని ధారూర్ మండలం కుక్కింద గ్రామంలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని, ఔసుపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపం చాయతీ భవనాన్ని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన గ్రామ సభలలో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అదిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. హాస్పిటల్ నిర్మాణానికి, ఆధునిక పరికరాల ఏర్పాటుకు భారీ ఎత్తున నిధులను మంజూరు చేస్తుందన్నారు. డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ పోస్ట్ లను భర్తీ చేయడం జరుగుతుందన్నారు . పట్టణాలలో బస్తి దవాఖానాలు లాగా గ్రామాలలో పల్లె దవాఖానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆధునిక కాలంలో మానసిక ఒత్తిడి ద్వారా ప్రజలు పెద్ద పెద్ద జబ్బులకు గురవు తున్నారు. యాబై సంవత్సరాలు దాటిన ప్రతి వ్యక్తి ఆరు నెలలకు ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలి. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. పేదలు వైద్యం కోసం డబ్బులు ఖర్చు చేయలేరని రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద ఎత్తున నిధులను ఇస్తుందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాలకు భారీగా నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత కరంటు, సబ్సిడీ గ్యాస్ సిలెండర్, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహాళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాలు అమలవుతున్నాయి. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో మహిళా సాధికార పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో వికారాబాద్ నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు అవుతున్నాయి. రోడ్లు, భవనాల శాఖ ద్వారా 600 కోట్లు, పంచాయితీ రాజ్ శాఖ ద్వారా ఇప్పటికే 480 కోట్లు మంజూరు కాగా నూతనంగా మరో 53 కోట్లు నూతనంగా మంజూరు అయ్యాయి. గత ప్రభుత్వంలో పదేళ్ళు రోడ్లకు నిధులు రాలేదు. రోడ్లు అద్వానంగా తయారయ్యాయి. నేను వచ్చాక రోడ్లను బాగు చేయించాలనే శ్రద్దతో పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఆర్ అండ్ బి, పంచాయితీ రాజ్ శాఖల ద్వారా మంజూరైన నిధులతో వచ్చే రెండేళ్లలో నియోజకవర్గంలోని అన్ని రోడ్లను బాగు చేస్తామన్నారు. మన ప్రాంతానికి సాగునీరు అందించాలనే ఆశయంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి పథకాల ద్వారా ప్రయత్నాలు చేశానని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల పథకంలో సుమారు 1500 కోట్ల రూపాయల పనులు కూడా అయ్యాయి. అయితే గత ప్రభుత్వం పదేళ్ళు ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది, పనులు జరుగలేదు. తరువాత జూరాల నుండి నీళ్ళను తరలించే విదంగా సర్వేలు చేయించి జీఓ కూడా తీసుకువచ్చాను. ఈ పథకాన్ని కూడా గత ప్రభుత్వం పక్కన పెట్టి మన ప్రాంతానికి అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుతం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీళ్ళు కొడంగల్ దగ్గరి వరకు వస్తున్నాయి, మాకు కూడా ఇప్పించాలని కోరగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరే అని హామీ ఇచ్చారు. సాగు నీళ్ళు వస్తే మన ప్రాంత రైతుల కష్టాలు తీరుతాయని తెలిపారు. స్వర్గీయ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన కోట్ పల్లి ప్రాజెక్టును తరువాత ఎవ్వరూ పట్టించుకోలేదు. ఇప్పుడు నేను పూర్తి స్థాయిలో మరమ్మత్తుల కోసం తొంబై కోట్ల రూపాయలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. పనులు చురుకుగా జరుగు తున్నాయని తెలిపారు. చెరువుల ఆధునికీకరణ, నూతన చెక్ డ్యాం నిర్మాణానికి నిధులను మంజూరు చేయిస్తానని తెలిపారు. అనంతగిరిని రూ. 2,500 కోట్లతో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం, ఈ ప్రాజెక్టు ద్వారా అయిదువేల నుండి పదివేల ఉద్యోగాల కల్పన జరుగుతుంది. స్థానికులకే ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, గ్రామస్తులు.

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

**యుఎస్పిసి ఆధ్వర్యంలో తహసిల్దార్ కి వినతి**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** పాఠశాల విద్య, ప్రభుత్వ ఉపాధ్యాయులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని నేలకొండపల్లి మండల ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యఎస్పిసి) డిమాండ్ చేసింది.సమస్యల పరిష్కారం కోసం దశల వారి పోరాట కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక తహసిల్దార్ కి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న పిఆర్సి,డిఏ లను వెంటనే ప్రకటించాలని,సిపీఎస్ రద్దుచేసి ఓపిఎస్ ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఖాళీగా



ఉన్న పోస్టులను భర్తీ చేసి,టెట్ పరీక్షల నిర్వహణలో న్యాయబద్ధమైన విధానాలు పాటిస్తూ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని,సకాలంలో యూనిఫామ్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు.సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే దశల వారిగా ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు టి.వెంగళరావు,కట్టా పద్మ, ఆర్.అరవింద్ కుమార్,యూటీఎఫ్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శుల జే.జ్యోతి,తొర్తి గురవయ్య, టిపిటీఎఫ్ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గోవిందరావు,రామారావు,గోపాలరావు,మురళి, బాబు,వెంకటరమణ,ప్రతిమ,జి.భవాని,బి.నాగేశ్వరావు,బి. శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు,రవి,గణేష్,చిన్న,అనిల్ కుమార్,నాగేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**చట్టబద్ధతతో పథకాలు అమలు చేయాలి - నేతల వెల్లడి**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం: ప్రజా పాలన ఏర్పడిన నాటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని నేతలు పేర్కొన్నారు.ఖమ్మంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఏదైనా ప్రభుత్వ పథకాన్ని అమలు చేసే ముందు దానికి చట్టబద్ధత, నిబంధ నలు, ఆర్థిక పరిమితులను స్పష్టంగా నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో కొన్ని పథకాలు సరైన చట్టపరమైన విధానాలు పాటించకుండా, కేవలం జీవోల ఆధారంగా అమలు చేయడం వల్ల న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని వివరించారు. అందువల్ల ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పథకాలకు చట్టబద్ధమైన రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు న్యాయపరమైన కారణాలతో నిలిచిపోకుండా వాటికి అవ సరమైన చట్టపరమైన విధానాలను ముందుగానే పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు.

**ఆర్థిక వృద్ధి, అభివృద్ధి రెండూ సమానం**

ప్రభుత్వానికి ఆర్థిక వృద్ధి, అభివృద్ధి రెండూ సమానంగా ముఖ్యమని నేతలు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే చర్యలతో పాటు, ప్రజలకు శాశ్వత ప్రయోజనం చేకూరే అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. పేద ప్రజల సంక్షేమం, ఆడపిల్లల వివాహాలు, ఆరోగ్య సమస్యల వంటి అంశాల్లో ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తోందని వెల్లడించారు.

**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి**

అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఏ పార్టీకి చెందిన ప్రజాప్ర తినిధి అయినా అభివృద్ధి పనుల కోసం ముందుకు వస్తే సమానంగా సహకరిస్తూ ఖమ్మం జిల్లాలో అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు రాజకీయాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయకుండా, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించే శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక స్థిరత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సూడా డైరెక్టర్ ముఖ్తార్ షేక్, 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మండడుపు మనోహర్, 19వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకట నారాయణ, 39వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాదూరి ప్రసాద్, ఖమ్మం డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పాలకూర్తి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

# శాశ్విత పరిష్కారం కోసమే భూ రీ సర్వే:తహసీల్దార్ డీ.సైదులు

**భగత్ వీడులో రెవెన్యూ బృందాలతో రీ సర్వే ప్రారంభం**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** సమగ్ర భూ రీ సర్వేతో భూ యాజమన్య సమస్యలకు శాశ్విత పరిష్కారం లభించనుందని కూసుమంచి తహసీల్దార్ డీ.సైదులు తెలిపారు. గురువారం భగత్ వీడు గ్రామంలో భూ సమగ్ర సర్వే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సరిహద్దు, యాజమాన్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్రంలో ప్రతి భూమిని ఆధునిక



టెక్నాలజీ, రోవర్స్ సహాయంతో రీ సర్వే చేసి భూ ఆధార్ తో కూడిన యాజమాన్య హక్కులను కల్పించుటకు నిర్ణయించారన్నారు. అందులో భాగంగానే గురువారం భగత్ వీడు రెవెన్యూ గ్రామంలో పది సర్వే, రెవెన్యూ బృందాలతో రీ సర్వే కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ అవకాశాన్ని భూ యజమానులందరూ వినియోగించుకొని, భూ సర్వే కు తమ వద్ద ఉన్న భూమికి సంబంధించిన ఆధారాలతో సమాచారం ఇచ్చిన సమయానికి ప్రదేశంపై హాజరై సర్వేకు సహకరించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు మేలు చేయుటకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీ ల్యాండ్ సర్వే రాజేందర్, తహసీల్దార్ సైదులు, సర్పంచ్ వసంత లక్ష్మి , సర్వే టీంలు రెవెన్యూ సిబ్బంది, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

# తొలి టెస్ట్‌లో స్నికో వివాదంపై దుమారం






ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో స్నికో వివాదం తీవ్ర దుమారం రేపింది. టెక్నాలజీ సాయంతో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ప్రస్తుతం ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది.రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం డార్విన్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్ తొలి రోజు ఆటలో బంగ్లాదేశ్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బంగ్లాదేశ్ యువ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. స్టీవ్ స్మిత్ (109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు.అయితే ఇన్నింగ్స్ ఆరంభంలోనే అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. టెక్నాలజీ సాయంతో బచాయించాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 21వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎబాడోట్ హొస్సేన్ వేసిన ఈ ఓవర్ నాలుగో బంతి స్టీవ్ స్మిత్ బ్యాట్‌కు దగ్గరగా వెళ్తూ కీపర్ చేతిలో పడింది. దాంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు వికెట్ కోసం అప్పీల్ చేశారు. స్మిత్ కూడా ఔటేనని భావించి పెవిలియన్ వైపు నడిచాడు. కానీ అంపైర్ కుమార్ ధర్మసేన ఔటివ్వకపోవడంతో బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో బంతి బ్యాట్‌కు తాకినట్లు స్పైక్ కనిపించలేదు. దాంతో స్మిత్ తిరిగి బ్యాటింగ్ చేపట్టాడు. అయితే ఈ నిర్ణయం తీవ్ర వివాదాస్పదమైంది. టెక్నాలజీలో లోపం ఉందని నెటిజన్లు ఆరోపించారు. ఆస్ట్రేలియా ఛీటింగ్ చేసిందని మండిపడ్డారు.తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో ఈ ఘటనపై స్మిత్ స్పందించాడు. తాను ఔటనే భావించానని, కానీ బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదన్నాడు. 'నేను ఔటయ్యాననే భావించాను. నేను చాలా అదృష్టవంతుడిని. టెక్నాలజీనే నన్ను కాపాడింది. ఒకవేళ అంపైర్ ఔటిచ్చి ఉంటే నేను వెళ్లిపోయేవాడిని. కొన్నిసార్లు ఇలా జరుగుతుంటుంది. అయితే బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయాన్ని నేను కచ్చితంగా చెప్పలేను. కానీ బ్యాట్‌కు తాకినట్లు నాకు అనిపించింది.'అని స్మిత్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హోస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజులో తంజిద్ హసన్(32 బ్యాటింగ్), మోమినుల్ హక్(35 బ్యాటింగ్) ఉన్నారు.

# శ్రీలంక పర్యటనలో పడిక్కల్ చెలరేగుతాడు




## మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం

శ్రీలంక పర్యటనలో టీమిండియా యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ చెలరేగుతాడని మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం చెప్పాడు. శ్రీలంక కండిషన్స్ అతని బ్యాటింగ్ శైలికి సరిగ్గా సరిపోతాయని తెలిపాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారం గాలే వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌లో దేవదత్ పడిక్కల్ మూడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. సాయి సుదర్శన్ గాయంతో ఈ పర్యటనకు దూరమవడంతో పడిక్కల్‌కు మార్గం సుగుమమైంది. అంతేకాకుండా వామప్ మ్యాచ్‌లో అతను అద్భుతమైన శతకంతో చెలరేగాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన రహానే.. పడిక్కల్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాడు. టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ గురించి ఆలోచించకుండా.. టెస్ట్ సిరీస్‌పై ఫోకస్ పెట్టాలని సూచించాడు. శ్రీలంక జట్టును ఏ మాత్రం తక్కువ అంచనా వేయకూడదని హెచ్చరించాడు. 'శ్రీలంక కండిషన్స్ దేవదత్ పడిక్కల్‌కు సరిగ్గా సరిపోతాయి. అతను మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు కాబట్టి.. ఆరంభంలో కాస్త జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. ఒకసారి క్రీజులో కుదురుకున్న తర్వాత స్పిన్ బౌలింగ్‌ను అతను సమర్థవంతంగా ఎదుర్కోగలడు. ఫ్రంట్ ఫుట్, బ్యాక్ ఫుట్ షాట్స్‌తో అతని వద్ద పూర్తి స్థాయి బ్యాటింగ్ నైపుణ్యాలు ఉన్నాయి. అయితే మూడో స్థానంలో ఆడే బ్యాటర్ ముందు చూపుతో ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ మూడో స్థానం బ్యాటర్ రాణిస్తే.. జట్టు మొత్తం ఆధిపత్యం చెలాయించగలదు. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ అతను మంచి రిథమ్‌లో కనిపిస్తున్నాడు. అతను తన ఫామ్, రిథమ్ నమ్ముకొని ఆడాలి. తనపై తాను అనవసర ఒత్తిడి పెంచుకోకుండా ఉండటం ముఖ్యం. అతనికి పరుగులు ఎలా చేయాలో తెలుసు. స్పిన్నర్లపై కట్, స్వీప్, స్టెప్ ఔట్ షాట్స్‌తో ఎదురుదాడి చేయగలడు.'అని రహానే చెప్పుకొచ్చాడు. భారత్ డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్ గురించి ఆలోచించి శ్రీలంకను తేలికగా తీసుకోకూడదని రహానే హెచ్చరించాడు. 'డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌ను దృష్టిలో పెట్టుకొని శ్రీలంకను తేలికగా తీసుకోకూడదు. భారత్ ముందుగా తొలి టెస్ట్ గెలవడంపై ఫోకస్ పెట్టాలి. ఆ తర్వాతే రెండో టెస్టు గెలిచి 2-0తో సిరీస్ క్లీన్ స్వీప్ చేయడం గురించి ఆలోచించాలి. కీలకమైన క్షణాలను గుర్తించి ఆధిపత్యం చెలాయిస్తేనే సిరీస్ కైవసం అవుతుంది. ఈ సిరీస్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ఎందుకంటే టెస్ట్‌ల్లో బాగా రాణించాలనే కసితో శ్రీలంక కూడా ఉంది. ఈ సిరీస్ ఏ మాత్రం ఏకపక్షంగా ఉండదని నేను భావిస్తున్నా.'అని అజింక్యా రహానే అన్నాడు.

# కేఎల్ రాహుల్ మా ఎక్స్‌ఫ్యాక్టర్..

## టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్



శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సన్నదమైంది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. ఈ క్రమంలో ఈ సిరీస్‌ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. అయితే ఈ సిరీస్‌లో వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ తమ ఎక్స్‌ఫ్యాక్టర్ అని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. తొలి టెస్ట్ నేపథ్యంలో మోర్కెల్ గురువారం మీడియాతో మాట్లాడాడు. ప్రస్తుత భారత జట్టు బ్యాటింగ్ లైనప్‌లో కేఎల్ రాహుల్‌కు మాత్రమే శ్రీలంకలో ఆడిన అనుభవం ఉందని, అది జట్టుకు ఉపయోగపడుతుందని తెలిపాడు.'టెస్ట్‌ల్లో కేఎల్ రాహుల్ గత కొన్నేళ్లుగా భారత బ్యాటింగ్ విభాగాన్ని నడిపిస్తున్న తీరు అద్భుతం. శ్రీలంక కండీషన్స్, పిచ్‌లపై అతనికి అపారమైన అనుభవం ఉంది. అతనికి ఉన్న ఈ అనుభవం యువ ఆటగాళ్లకు ప్రాక్టీస్ సెషన్స్‌లో ఎంతగానో ఉపయోగపడింది. అదేవిధంగా గత కొన్ని నెలలుగా మా ప్లేయర్స్ వ్యక్తిగతంగా తమ ఆటను ఎంతో మెరుగుపరుచుకున్నారు. ఈ సిరీస్‌ను గెలవడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేశాం. ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు 10 రోజుల ముందే ఇక్కడికి వచ్చాం.'అని మోర్నీ మోర్కెల్ చెప్పుకొచ్చాడు. తొలి టెస్ట్‌లో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉందని మోర్నీ మోర్కెల్ తెలిపాడు. గాలె పిచ్ కండిషన్స్ పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఓవైపు నుంచి భారత స్పిన్ దళం అటాక్ చేస్తే.. మరో వైపు నుంచి పేసర్లు ఒత్తిడి తీసుకు రాగలరని తెలిపాడు. 'గాలే పిచ్ చూడటానికి మంచి వికెట్‌లా కనిపిస్తోంది. కానీ మ్యాచ్ సాగేకొద్దీ పిచ్‌లో మార్పు ఉంటుందని నేను అనుకుంటున్నా. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే విధంగా మేం సిద్ధమయ్యాం. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి మాకు కావాల్సింది మానసిక బలం, బ్యాటింగ్‌లో సమయం, బౌలింగ్ స్పెల్స్ వేయడం, బంతిని సరైన ప్రదేశంలో వేయడం వంటివి.'అని ఇయాన్ మోర్గాన్ చెప్పుకొచ్చాడు. బ్యాటింగ్ పరంగా టీమిండియా బలంగానే ఉన్నా.. బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా దూరమవ్వడం పెద్ద లోటు కాగా.. జట్టులో ఉన్న ఆటగాళ్లంతా శ్రీలంక పర్యటనకు కొత్త కావడం మరో విశేషం. కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాకు మినహా శ్రీలంక పర్యటనలో టెస్ట్ సిరీస్ ఆడిన అనుభవం మరే ఆటగాడికి లేకపోవడం గమనార్హం.



# గంభీర్‌కు అండగా నిలిచిన హర్భజన్ సింగ్

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అండగా నిలిచాడు. టీమిండియా వైఫల్యానికి గంభీర్‌ను బాధ్యుడిని చేస్తూ అతనిపై విమర్శలు గుప్పించడం సరికాదని అభిప్రాయపడ్డాడు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషని, అందుకే అతన్ని నిర్ణయాలు నచ్చడం లేదని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. గంభీర్ కోచింగ్‌లో భారత జట్టు ఐసీసీ టోర్నీలు గెలిచిందని గుర్తు చేశాడు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. శనివారం నుంచి గాలే వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. అయితే గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెస్ట్‌ల్లో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. ఈ క్రమంలోనే అతని కోచింగ్ తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. శ్రీలంకతో సిరీస్‌కు ముందు మాట్లాడిన హర్భజన్ సింగ్.. గంభీర్‌ను వెనకేసుకొచ్చాడు. 'గౌతమ్ గంభీర్ ఎందుకు ఇంతలా ఎందుకు విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే అతన్ని నిదించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు. గంభీర్ క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచి నాకు తెలుసు. ఆట పట్ల చాలా నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ ఆరంభంలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతనికి మంచి ఫ్రెండ్స్. ఇప్పటికీ వారే స్నేహితులనుకుంటా. అతను ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడుతాడు. అందుకే అతని నిర్ణయాలు కొందరికి నచ్చవు. కవర్ చూసి పుస్తకం ఎలాంటిదో చెప్పకూడదని పెద్దలు అంటారు. గంభీర్‌ను విమర్శించడం కూడా తప్పే. గెలుపు కోసమే ఆడాలని నమ్మే కోచ్ అతను. ఓటమిని ఏ మాత్రం జీర్ణించుకోడు. డ్రా కోసం ఆడేందుకు అస్సలు ఇష్టపడడు. శుభ్‌మన్ గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. అతను గొప్ప ఆటగాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా బ్యాటర్‌గా సత్తా చాటాడు. ఫుట్‌బాల్‌లో లియెనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఆడుతున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో ఆడితే తప్పేంటి? ఏ ఆటగాడికైనా సరే ప్రదర్శనే కొలమానం. వయసు ముఖ్యం కాదు. విరాట్ కోహ్లీ 37 ఏళ్ల వయసులోనూ 20 ఏళ్ల కుర్రాడిలా మైదానంలో చురుకుగా ఉంటాడు. భారత జట్టులో కోహ్లీ.. మెస్సీ లాంటి ప్లేయర్. భారత జట్టులో ఫిట్‌నెస్ విప్లవం తెచ్చింది అతనే. చివరి రోజు 400 పరుగుల లక్ష్యం ఉన్నా సరే విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ మెరుగ్గా రాణిస్తున్నారు. కాబట్టి వారిని వన్డేల్లో కొనసాగించాలి.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.



# భారత్‌తో టెస్ట్‌కు శ్రీలంక జట్టు ప్రకటన

రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగే టెస్ట్ టీమ్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ధనంజయ డిసిల్వా సారథ్యంలోని 16 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను బుధవారం వెల్లడించింది. కమిందు మెండిస్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సీనియర్లతో పాటు ఇటీవల టీమిండియా వామప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న పలువురు ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. వెటరన్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్‌వెల్లా సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ముగ్గురు అనామక ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. సీనియర్ బ్యాటర్ కుశాల్ మెండీస్ తొడ కండరాల గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. మణికట్టు సర్జరీతో పాతుమ్ నిస్సంక సేవలను శ్రీలంక కోల్పోయింది. దాంతోనే 33 ఏళ్ల నిరోషన్ డిక్‌వెల్లాకు పిలుపు దక్కింది. 2023లో శ్రీలంక తరఫున అతను చివరి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. స్పిన్‌కు అనుకూలంగా ఉండే గాలే మైదానంలో బలమైన భారత బౌలింగ్ యూనిట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్‌కు అతని చేరిక బలాన్ని చేకూర్చనుంది. ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ కేశర నువంత, బ్యాటర్ పాసిందు సూర్య బండారా, సోనా దినుషా తొలిసారి శ్రీలంక టెస్ట్ టీమ్ పిలుపును అందుకున్నారు. ఇటీవల భారత్‌తో జరిగిన వామప్ మ్యాచ్‌లో నువాంత మూడు వికెట్లు తీసాడు. భారత్-ఏ జరిగిన అనధికారిక టెస్ట్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. దాంతో అతనికి శ్రీలంక జట్టులో చోటు దక్కింది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది.

### భారత్‌తో తొలి టెస్ట్‌కు శ్రీలంక టీమ్:


ధనంజయ డి సిల్వా (కెప్టెన్), కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), లహిరు ఉదార, నిషాన్ మదుష్క, దినేష్ చండిమల్, పసిందు సూర్యబండార, సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా (వికెట్), రమేష్ మెండిస్, ప్రబాత్ జయసూర్య, కేశర నువంత, మిలన్ ద్రువాల్నాండో, ఎఫ్‌సి ధృవాల్నాండో, ఎఫ్. మధుశంక.



# సుకుమార్ కూతురు సుకృతివేణికి బోస్టన్ స్కూల్ స్కాలర్‌షిప్

'పుష్ప' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందారు సుకుమార్. ఇటీవల జాతీయ అవార్డుల్లో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగానూ ఘనత సాధించారు. ఆయన తనయ సుకృతి వేణి కూడా విభిన్న బాటలో పయనిస్తున్నారు. 2024 సంవత్సరానికి జాతీయ ఉత్తమ బాల నటిగా 'గాంధీ తాత చెట్టు'కు అవార్డు సాధించిన సుకృతి వేణి ఇప్పుడు మరో అరుదైన ఘనతను కైవసం చేసుకుంది. అమెరికాలోని 'బోస్టన్ అంతర్జాతీయ బర్క్‌లీ స్కూల్ ఆఫ్ మ్యూజిక్' సంశ్రీత విభాగంలో ఎన్‌సెంబుల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికై ఫుల్ స్కాలర్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. మొత్తం 272 మంది పిల్లలు ఆడిషన్ ఇవ్వగా, కేవలం 14 మందికి మాత్రమే పూర్తి స్కాలర్‌షిప్ వచ్చింది. అందులో సింగర్స్ విభాగంలో ఎంపికైన ఏకైక విద్యార్థిని సుకృతి వేణి కావడం విశేషం.








# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం

అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.




# అలా ..రజనీకాంత్ గారితో..



టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు, అలాగే సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.

# లోకేశ్ కనగరాజ్ చిత్రం 'డీసీ'కి పెరుగుతున్న కలెక్షన్లు

కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com